
# నడుస్తోంది నా దేశం...?

యన్నంరెడ్డి వెంకటరెడ్డి



ఖమ్మం రైల్వే ప్లాట్ ఫామ్ మీద ఒక అమ్మాయి ఉంది. ఆమె వయసు పదిహేను, పదహారు సంవత్సరా లుంటాయి. అమ్మా, నాన్నా, ఇల్లూ, వాకిలీ ఏమీ లేనట్టే అనిపించేది. దాని క్కారణం—ఆ అమ్మాయి ఎప్పుడూ ప్లాట్ ఫామ్ మీద ఒంటిగా తిరుగుతుండడమే. . .

'ఎలా పొట్ట గడుస్తుందీ. . .' అన్న సంశయం నన్ను పీక్కు తినేది.

'ఏ చింతా లేకుండా అలా నిశ్చింతగా ఎలా ఉండ గలుగుతుందో. . .' అని నాకు అప్పుడప్పుడూ సందేహం కలుగుతుండేది.

ఆ అమ్మాయి ముఖంలో అలసట, నీరసం, విస్పృహ లాంటివి నాకు ఏ నాడూ కనిపించలేదు. అంటే తిండికి ఇబ్బందిగా లేదనుకోవాలా?

శరీరం నిండుగా ఎముక కనపడనంత కండతో ఉందంటే ఆమె తిండి కోసం బాధ పడడం లేదను కోవాలా. . .?

ఆ అమ్మాయి కున్న సంపదల్లా మాసిపోయిన పీలికల పాత వోణి, రెండు తుక్కు గుడ్డలు, ఒక మాసికల సంచీ...

ప్లాట్ ఫామ్ మీద తూనీగ లాగా ఎగురుతూ ఎదురుపడ్డ ప్రతి వారినీ కులాసా ప్రశ్నలతో పలకరిస్తుంటుంది.

'అన్నయ్యా! టీ తాగలేదు. ఒక పావలా ఇవ్వవూ అని ఎంతో చనువు ఉన్నట్టు చేయి చాస్తూ, గోముగా చూస్తూ అడుగుతుంది.

'బాబాయ్, బాబాయ్—పది పైస లివ్వు, షోడా తాగాలి' అంటూ తన అవసరాన్ని చెబుతూ అధికార యుతంగానూ అడుగుతుంది.

"అక్కయ్యా! బావ బాగా చూసుకుంటున్నాడా? పిల్లలు బాగాఆడుకుంటున్నారా? ఈ ఇద్దరు పిల్లలు చాలక్కయ్యా. . ." అంటూ పరామర్శించేది.

ఆ పలకరింపులో ఎంతటి ఆత్మీయతో!

ఆ కల్మష మెరుగని నవ్వు ఎంత నిర్మలమో!

హాయిగా నవ్వేది తీయగా మాట్లాడేది. మాట్లాడు తున్నప్పుడు కళ్ళను ఎంత అందంగా తిప్పుతుందని . . . కనుబొమలు ఎంత నాజూగ్గా కదిలిస్తుం దని. . .

ఒక సారి — ప్లాట్ ఫామ్చివరగా ఉన సిమెంటు బెంచీపై కూర్చుని, కొత్త దంప తులు తమ కృషి ఫలాన్ని — పండిన పంటను చూసుకుని హాయిగా, ఆనందంగా తృప్తి నిండిన కళ్ళతో ఆడుకుంటుంటే వారి దగ్గిరికి చేరి వారి ఆనందంతో పాలు పంచుకుంటూ ఎత్తు కుంటాను. రావా బాబూ?' అని అనడమే తడవుగా ఆ బాబు ఆమె చేతుల్లోకి ఎలా వెళ్ళి పోయాడో. . .

ఆ అమ్మాయిలో ఆడ మనసు కదిలి ఉండొచ్చు...

ఆ అమ్మాయిలో మాతృ హృదయం పొంగి పొరలి ఉండొచ్చు. . .

"అందుకే— ఆ బాబును వక్షాల కదుముకుంది — తల నిమురుతూ తన్మయంతో.

అంతలోనే ఆ బాబును ఆ దంపతుల కిచ్చేసి "ఉండు బాబు. . . ఇప్పుడే వచ్చేస్తాను. . ." అని చెంగు చెంగున లేడిలా గెంతుతూ క్యాంటీన్ వైపు పరుగు తీసింది.

'పిచ్చి పిల్ల'. . . అనుకుని, నవ్వుకుంటూ కబుర్లలో పడ్డారా దంపతులు.

వెళ్ళినంత వేగంగా తిరిగొచ్చి బిస్కట్ పాకెటు చేతికందించ బోతుంది. ఆ చిన్ని చేతికి ఇమడక పోవడంచేత పాకెట్ చించి, ఒక బిస్కెట్ నోట కరిపించి, ఉప్పొంగే ఆనందంతో తేలిపోతూంది.

అంతా మెరుపులా జరిగి పోవడంతో 'వద్దని' వారించ బోయి, నోట మాటరాక బిత్తరగా చూశారు. ఆ అమ్మాయి మరి కనిపించ లేదు.

అలా అలా తిరుగుతూ కాళ్ళు పీకిన తరవాత ఒక బెంచీ మీద చతికిల బడి బుద్ధిగా కూర్చుని వచ్చీ పోయే జనాలను, వారి హడావిడి అవసరాలను చూ స్తూ ఉండిపోతుంది.

చీకటి పడగానే ఏం తింటుందో ఏమో. . .టీ మాత్రం తాగి ఆ రైల్వే క్యాంటీన్ పక్కనే నిద్ర కుపక్రమిస్తుంది.

చలి కానీ, ఎండ కానీ, వాన కానీ—ఆ ప్లాట్ ఫామ్‌పై అదే స్థానం. . . అవే పాట్లు. . .

రెండు, మూడు రోజుల కయినా స్నాన మెక్కడ చేస్తుందో, ఎలా చేస్తుందో మాత్రం తెలీదు. ఆ ఊపును ఒరగా చూసూ్త కళ్ళతో ఎంత మంది తింటున్నారో. . .

ఏం చుట్టుకుని స్నానం చేస్తుంది?

ఏం కట్టుకుని తిరుగుతుంది? ఉన్న ఆస్తి ఒక్క మాసికం ఓణీనే కదా?

ప్రశ్నలు. . .ప్రశ్నలు. . .

వాటికి సమాధానం నా దగ్గర లేదు.

ఎమ్. ఎ. సీటు రావడంతో హైదరాబాదు వెళ్ళి పోయాను. మళ్ళీ తిమ్మం రావడం కుదరలేదు. ఆ అమ్మాయిని చూడక దాదాపు ఆరు నెల్లు కావస్తూంది.

ఆ అమ్మాయి చుట్టూ ఆలోచనలు ఎప్పటి కప్పుడు తిరుగుతూనే ఉన్నాయి. ఆ ఆలోచనలకు ఒక రూపం ఇవ్వాలన్న తపన. . .

ఎలా. . .? ఆమెను గురించి ఏం రాయను? మలుపు తిరిగే ఒక్క సంఘటన. . . కథకు కావలసిన ఒక్క పాయింటు. . .

ప్లాట్‌ఫామ్ అంతా చూసినా ఆమె జాడ ఎక్కడా కనిపించలేదు.

ఆమె ఎప్పుడూ కూర్చునే చోటు వెతికాను.

ఊహుఁ. . .

పడుకునే స్థలం... ఖాళీగా లేకపోయింది.

నాకు ఆత్రత ఎక్కువయింది.


ఆత్రత ఆలోచనల్ని తరుముతూంది.

"హల్లో. . ." అంటూ వెనక నుండి ఎవరో విష్ చేశారు. పడుతూనే వెనుతిరిగి చూస్తే...? ఏముంది. . . అరటి తొక్కమీద కాలు. . .

"ఏరా... ఏమిటలా పరధ్యానం...?" రెండు అంగల్లో నన్ను చేరి పడకుండా పట్టుకున్నాడు ప్రసాద్.

"ఆఁ. . .ఆఁ. . .ఏదే. . . ఏదేరా. . ." దడ పోయిన దడతో, అదురుతున్న గుండెతో అన్నా న్నేను.

"పద్లే కానీ, కాస్త నిమ్మది పడు . ." ఇద్దరం మెల్లిగా నడుస్తూ క్యాంటీన్ కెళ్ళాం.




"తినవేం?" అన్నాడు ప్రసాద్, ప్లేటును మరింత దగ్గిరికి నెడుతూ. . .

తడబాటును కప్పుకుంటూ మెల్లగా సమోసా నములుతున్నాను.

"అసలు కథేమిటేరా?" నా ధోరణిను గమనించి ప్రసాద్ అన్నాడు.

"ముందిది కానివ్వు... నడుస్తూ చెబుతాగా" అన్నాను.

టీకూడా అయిన తరవాత "ఊఁ. చెప్పరా..." అన్నాడు.

'చెపితే ఏముంది. తెలిస్తే విషయం చెబుతాడు.

"ఈ ప్లాట్ ఫామ్ మీద ఒక అమ్మా యుండేది. కనపడదేం?"

"ఏం చేన్నా?"

"ప్రసాద్. . . ఏమి టా మాటలు. . . ఆమెను గురించి ఎన్నో సార్లు చెప్పాను. ఆమె నాకు. . ." గొంతు బొంగురు పోయింది. అక్కడి కా మాటను తుంచాను. "తప్పుగా వూహించ లేదెప్పుడూ..." కాస్త కరుకుతనం కంఠంలోంచి తొంగి చూసింది.

"సారీ రా. . . ఇప్పు డామె పరిస్థితి. . ." ఆగాడు ప్రసాద్.

ఆరాటం చంపుకోలేక, "ఏం? ఏమయింది?" అడిగాను.

"ఆమె. . ."

"అన్నయ్యా, బాగున్నావా?"

ఆ అమ్మాయే!

ఆ పిలుపులో మునుపటి తీయదనం లేదు

ఆ కదలికలో పూర్వపు చలాకీతనం లేదు.

జ్యోతుల్లా వెలిగే కళ్ళు కళా విహీనంగా, గాజు గోళాల్లా ఉన్నాయి.

జీవం తొణికిస లాడె పెదవులు తోలు ముక్కల్లా ఉన్నాయి.

ఏ. . .మి. . .టి. . .?

ఆమె. . . ఆమె. . .గర్భవతా. . .?

"అన్నయ్యా. . ." అతి మామూలుగా పిల స్తూంది.

"ఏం. . ."

"ఇన్నాళ్ళూ ఎక్కడి కెళ్ళావన్నయ్యా... నాకు టీకి డబ్బు లెవరి స్తా రనుకున్నావ్?"

తల దించుకున్నాను.

"బాధ పడుతున్నావా? ఎందుకు?"

ఎందుకేమిటి? గుండెలో రేగే పెను తుఫాను వాపే శక్తి నాకు లేదు. దావానలాన్నీ, బడబాగ్నినీ ఆపే యుక్తి నాకు లేదు. అందుకే గుండె మండకా తప్పదు. . . ఆలోచనల తుఫాను రేగకా తప్పదు. . .

'అన్నయ్యా' అని పిలిచే పెదవులు వణుకు తున్నాయి.

నాకు అక్కా చెల్లెళ్ళు లేరు. అందుకే ఆ పిలు పంటే ఆరాటం. . . 'అన్నయ్యా. . .' అంటే నా మనసు ఆనందంతో నిండి, ఏదో అనిర్వచనీయ మైన అనుభూతి. . .ఆత్మీయత నిండిన ఆ పిలుపుకే ఒళ్ళు జలదరిస్తుంది.

అలాంటి పెదవుల వణుకు చూసి నా మనసు ఘోషించదా?

అంతలోనే వగలబడి విరగబడి నవ్వుతూంది పిచ్చిగా.

అయోమయంలో ఉండిపోయి, ఆమెను ఆప బోయాను.

ప్రసాద్ నన్ను ఆపాడు.

ఆమె కదిలి పోతూంది.

"ఆ మధ్య ఈ అమ్మాయిని కొందరు రేప్ చేశారట్రా. . . అది మొదలు ఆమెలో అప్పటి చురుకూ, చలాకీతనానికి బదులు దిగులు, దుఃఖం ... రెండు, మూడు నెలలు కుమిలి కుమిలి ఏడిచింది. నెలలు నిండడంతో భరించలేక పిచ్చి ఎబార్షన్ చేయించుకోమని ఎవరు చెప్పినా ఒప్పుకో లేదట. . . ఆమె" నోరు మూసేశాను.

వినలేను, వినలేను, వినలేను.

నా దేశంలో ఒంటరి స్త్రీ ఎప్పుడో ఒకప్పుడు చెరచబడుతుంది.

ఇది నా దేశపు ఫార్మాలిటీ.

నా దేశపు దౌర్భాగ్యం—నా దేశపు దరిద్రం నెత్తిన మొట్టుతూంటే ఇన్నిటి మధ్యా సతమతమవుతూ మరోఅంచున తెగువతనం. . . తెంపరితనం . . . మానభంగాలు . . . దోపిడీలు . . . ఛా. . . ఈ సమాజాని దోస్తూన్న దోపిడీ దొరల్లాగే స్త్రీల శీల సంపదను దోచే కామ చోరులు. . .ఛీ. . తను కథ రాసుకోవడానికి ఇదొక మలుపు. . .

ఈ మలుపు కోసమేనా తను ఆశించీ...ఎదురు చూసింది?

మౌనంగా ఆలోచిస్తున్నాను.

కావాలని సుఖం కోసం తపించే వాళ్ళు ఎబార్షన్ చేయించుకుంటారు. కానీ,ఈ అమ్మాయిది ఎంతటి సంస్కారం! ఎంతటి ఔన్నత్యం!

నా ఆలోచనల మబ్బుల్ని తరుముతూ ఉరుములా "నడుస్తూంది నా దేశం ప్రగతి పథం వైపు..." అంటూ పరిస్థితుల్ని తారుమారు చేస్తూ రేడియోలో పాట వినిపిస్తూంది. *